# బతుకు పడింది

రిటైర్‌మెంట్‌తో ఎంతో విశ్రాంతి వుంటుందని, దేశంలో చూడని ఎన్నెన్నో ప్రదేశాలు చూసిరావచ్చని ఎంతో ఉత్సాహంగా అనుకున్న జయరామ్ మనసు ఆ రోజు ఒక్కసారిగా చిన్నపోయింది. నాకు నువ్వు, నీకు నేను, చాలు కదా అని జయరామ్ అన్నప్పుడల్లా సుధామణి నవ్వి ఊరుకునేది. అప్పుడప్పుడు తమకి పిల్లలు లేరు అనే భావం మనసులో కదిలినా, వెంటనే దాన్ని పక్కకి నెట్టేసి భార్యాభర్తా సినిమాకో, స్నేహితుల ఇంటికో వెళ్లి కాలం గడిపి వచ్చేసేవారు.

'పిల్లలు లేకపోతేనేం, పెంచుకోండి, అదీ ఓ పుణ్యకార్యం చేసినట్టే' అంటే 'నాకు పిల్లలు లేరని ఎందుకంటారూ, అదిగో' అంటూ పేపరు చదువుతూ కూర్చున్న భర్తను చూపి గల గలా నవ్వేది సుధామణి.

జయరామ్, సుధామణి మద్రాసు వెళ్లాలని నిశ్చయించుకున్నారు. మద్రాసులో సుధామణి స్నేహితురాలుంది. అక్కడకెళ్లి అక్కడనుంచి మహాబలిపురం, కంచి చూసి రావాలని... పెళ్లయిన పదేళ్లకి వెళ్లిన మద్రాసు ట్రిప్పు ఇప్పుడు గుర్తొచ్చింది సుధామణికి.

మహాబలిపురంలో బస్సుదిగారు టూరిస్టు బస్సు - అందరితో బాటు అక్కడ చూడాల్సినవన్నీ చూశాక కంచికి వెళ్లారు, చీరలు కొనాలిగా మరి - సుధామణి తనకి, ఫ్రెండుకి కూడా కంచిపట్టు చీర కొన్నాక విష్ణుకంచిలో దేవాలయం చూడాలని బయల్దేరారు భార్యాభర్తా.

పెద్ద చెట్టు చుట్టూ అందరూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జయరామ్, సుధామణి కూడా ప్రదక్షిణం చేశారు. మామిడి పండు చిన్నది. వచ్చి సుధామణి పాదాల ముందు పడింది. గబుక్కున తీసి కళ్లకద్దుకుంది. అక్కడందరూ 'ఎంతదృష్టం, మీ కోరిక తీరుతుంది - అందుకే, ఆ పండు మీ ముందర పడింది' అంటూ తెగ సంతోషించారు. సుధామణి మనసులో అనుకుంది తనేం కోరుకుందీ!! -

'మీరేం కోరుకున్నారూ' అంది రహస్యంగా భర్తతో 'త్వరగా ప్రమోషన్ ఇప్పించమని' వెంటనే అన్నాడు జయరామ్. దేవుడి దగ్గర కూడా అదేనా - వంశోద్ధారకులు కావాలని కోరుకోవాలి అంది నవ్వి సుధారాణి - ఎప్పటి సంగతో ఇది!!

సుధామణి నల్లని జుట్టులో వెండి తీగలు మెరుస్తున్నాయి.

రిటైరయ్యాక ఇంట్లో ఇద్దరే వుంటుంటే, భర్త పెద్దగా పట్టించుకోవటం లేదు కానీ, భార్య చాలా బాధపడిపోతోంది... సూధామణి కళ్లముందు ఓ గొప్ప ఆలోచన మెరుపులా మెరిసింది.

తన అక్క కొడుకు గుర్తొచ్చాడు. ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. అక్కకి నలుగురు కొడుకులు... బావగారు పోయారీ మధ్య. తనకి చాలా ఇష్టమైన వాడు ఆఖరి వాడు చందు. సుధామణికి చాలా సంతోషమనిపించింది. జయరామ్ టి.వి. లో టెన్నిస్ చూస్తున్నాడు. 'దాని నోరు మూసి త్వరగా రండి' అంటూ టి.వి కట్టేసింది.

'మా చందు వున్నాడు కదా' -

'ఆ, వున్నాడు'

'ఇంజనీరింగ్ చదువుకుంటున్నాడు కదా'

'అవును. కాదన్నానా'

'వినండి - వాణ్ణి మనం...' భార్య ఏం చెప్తుందో గ్రహించాడు జయరామ్.

'వాణ్ణి పెంచుకుంటావా' - జయరామ్ గంభీరంగా అన్నాడు. 'అవును, పెంచుకుందాం, తప్పేమిటీ, మా అక్క కొడుకేగా' అంది భర్త కేసి కోపంగా చూస్తూ.

ఇన్నాళ్లుగా ఈ విషయం భార్యాభర్తా అనుకోవటం, అనవసరమైన బాధ్యతలు పెంచుకోవద్దని నిశ్చయించుకోవటం అయిపోయాక, ఇవాళ అరవై నిండుతున్న సుధామణి మళ్లీ పెంచుకోవటం అనే మాట తేవటం చాలా చికాకనిపించింది జయరామ్‌కి.

"మీరేమన్నా చెప్పండి - ఇంతవరకు మీకు ఇష్టం లేదనే పెంచుకోవటం, దత్తత తీసుకోవటం ఇలాటివేవీ అనకుండా విని నోరుమూసుకు ఊరుకున్నాను. తొమ్మిదయేసరికి ఇంట్లోంచి వెళ్లిపోతే, ఆరింటికి ఇల్లు చేరి, రోజు గడిచిపోయిందని అనుకున్నాను - కానీ, నాకేమిటీ శిక్ష - అంది - అయితే, ఓ పిల్లా పీచూ లేకుండా ఇల్లు - ఛీ, మీ ఇష్టంతో నాకేంపని - నాకూ వచ్చింది వయసు, మీకేనా' - జీరబోయిన గొంతుతో అరిచి లోపల కెళ్లిపోయింది సుధామణి.

జయరామ్ కూర్చీలో అలాగే కూచుని కిటికీ లోంచి కనబడే ఆకాశం వంక చూస్తున్నాడు... ఇంతకాలంఎ తెలియని వెలితి ఇప్పుడయితే తెలుస్తోంది. అది నిజం - కానీ,...

జయరామ్‌కి ఉన్నట్టుండి అతని చెల్లెలు సుబ్బలక్ష్మి గుర్తొచ్చింది... ముగ్గురాడ పిల్లల తల్లి సుబ్బలక్ష్మి. ఇద్దరాడపిల్లలున్నారు పెళ్లికి... ఏవో ఆర్థిక ఇబ్బందులతో, బావగారి చిన్న ఉద్యోగంతో గౌరవంగా కుటుంబం గడుపుకుంటున్నారు... జయరామ్‌కి ఉన్నట్టుండి చెల్లెల్ని చూడాలనిపించింది.

సుధామణి అక్కకి ఫోన్ చేసింది.

'నేనూ ఈయనా అదే అనుకున్నాం - చందుని మా దగ్గర పెట్టి చదివించుకుందామని. మాకూ కాస్త తోడుగా వుంటాడు. ఈయన మరీ ఒకటే గోల. అంతకు ముందు పట్టించుకోలేదు. ఇంత ఇంట్లో ఇద్దరం బిక్కుబిక్కుమంటూ వుండలేకపోతున్నాం' అంది సుధామణి.

వారం రోజులయేసరికి పెట్టె, పుస్తకాలు తీసుకొని చందు వచ్చేశాడు. సుధామణి మనసు ఆనందంతో పొంగిపోయింది... "అవును, బాబాయిగారు మరీ పట్టుపట్టారు - ఇదంతా ఆయన ప్రోత్సాహమే" అంది దూరంగా నించున్న భర్తవంక చూస్తూ సూధామణి.

వారం రోజులయింది చందూ వచ్చి. జయరామ్ ఆ రాత్రి బస్సులో విజయవాడ చెల్లెలింటికి వెళ్లాడు.

'ఏదైనా చిన్న ఉద్యోగం వుంటే చూడు - ఈ రాధని చేర్పిస్తాను...' అంది నెమ్మదిగా భర్త వినకుండా జయరామ్‌తో చెల్లెలు. 'పెళ్లి చేయాల్సిన పిల్లకి ఉద్యోగం ఏమిటీ? అన్నాడు జయరామ్ ఎదురుగా ముద్దబంతి పువ్వులా కనిపిస్తున్న రాధని చూస్తూ.

నాలుగు రోజులున్న జయరామ్ చెల్లెలి కూతురిని వెంటబెట్టుకొని వెళ్ళాడు తనతో.

సుధామణి ముఖం ఎర్రబడిపోయింది ఒక్కసారి. "మా అక్క కొడుకుని నేను ఇలా తెచ్చి మన ఇంట్లో చదువు సంధ్య చెప్పించటం ఇష్టం లేకపోతే చెప్పచ్చుగా - నా మీద పోటీగా మీ చెల్లెలి పిల్లని తేవాలా" అంది పడగద్దిలో .చాలా కోపంగా జయరామ్ మాట్లాడలేదు.

అనుకోకుండా ఇంట్లో చక్కగా పిల్లలిద్దరూ తిరుగుతుంటే ముచ్చటగానే వున్నా, తన మీద పంతంతో ఆడబిడ్డ పిల్ల రాధని తీసుకొచ్చాడనే కోపం మాత్రం పోలేదు సుధామణకి.

ఏడాది గడిచింది.

'మీ ఉద్దేశం ఏమిటీ - మా చందుని వాళ్ల ఇంటికి పంపేసి దీన్ని పెంచుకుందామనా' నిలదీసింది ఓ తెల్లారు ఝామున సుధామణి భర్తని.

'ఇలా రా చెప్తాను' అన్నాడు

సుధామణి భర్త మంచం పైన కూచుంది.

'రాధని పంపేయనా' అన్నాడు

సుధామణి మాట్లాడలేదు. నిజానికి రాధంటే సుధామణికి ఇష్టమే..... ఆడపిల్ల తనకి తోడుగా వుందని. కానీ, ఆడబిడ్డ పిల్ల కదా!! అయిష్టత.

జయరామ్‌కి చాలా కోపమొచ్చింది ఒక్కసారి. "అసలు ఈ బంధాలు వద్దన్నా, చివరికి మనం రిటైరై పోయాక నీకు వున్నట్టుండి పిచ్చిపుట్టి చందుని తెచ్చావు సరే - ఏడాదికి వాడు చదువయి అమెరికా వెళ్లిపోతానంటాడు. అప్పుడేం చేస్తావ్ - మళ్లా ఇద్దరమేగా"

జయరామ్ సూటిగా భార్య కళ్లలోకి చూశాడు.

"అంటే వాడు అమెరికా వెళ్లిపోతే ఇది వుంటుందనా, దానికి ఓ పెళ్లి పేరంటం చేయరా వాళ్ల అమ్మా నాన్నా?" అంది రోషంగా.

జయరామ్ గబుక్కున నవ్వాడు.

"ఏమిటా నవ్వు, మీరు చందుని పంపించే ప్రయత్నం చేస్తే, నేను దీన్ని పంపించేస్తా. ఎప్పటిలాగే ఇద్దరం -" అని ముఖం ముడుచుకొని వున్నట్టుండి సుధామణి బయటికి వెళ్లిపోయింది.

"అత్తయ్యా! చందు తిరుపతి, అటునించి మద్రాసు, మహాబలిపురం, కంచి అన్నీ తిరిగొస్తాడుట. మనం కూడా వెడదామా - కంచిలో" అంటూ ఏదో చెప్తోంది రాధ పొద్దున్నే కాఫీ కలిపి తెస్తూ.

సుధామణికి మళ్లీ కంచి గుర్తుకొచ్చింది. చెట్టుకి ప్రదక్షిణలు చేస్తుంటే వచ్చి పడ్డ మామిడి పండు

ఆర్నెల్లయ్యే సరికి మనసులో మాట బయటపెట్టాడు జయరామ్. నిజానికి రాధని తెచ్చింది ఇందుకేనననే విషయం జయరామ్‌కి తెలిసిందే కదా!!

ఒక్క నిమిషం ఆశ్చర్య పోయినా, ఆనంద మనిపించింది సుధామణికి.

'ఏదో కోపంతో అంటుంది కానీ, భర్తని అన్నన్ని మాటలు, మంచి ముందు చూపు, తెలివి వున్నాయి. అనుకుంది మనసులో భర్త ఆలోచనకి సంబర పడిపోతూ.

పిల్లలు లేరనే చింత లేకుండా, ఇద్దరు పిల్లలు ఇంట్లో!!

కొడుకూ కోడలూ తనకి లేరని చింత లేకుండా, చందు రాధ తన కొడుకూ, కోడలూ ఇంట్లో. కాలం గిర్రున తిరిగింది. జయరామ్, సుధామణి జీవితాలు పండాయనే ఆనందం ఇద్దరి మనసుల్లోనూ గొప్ప తృప్తినిచ్చింది. సుధామణి ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ, మనవడికి కళ్లకు కాటుక పెడుతుంటే గుమ్మంలో కారు హారన్ మోగింది.

మనవడి పౌడరు డబ్బా పట్టుకు కూచున్న జయరామ్ వీధిలోకి తొంగి చూశాడు.

స్నేహితురాలు జానకి, భర్తా లోపలకొచ్చారు. "అబ్బ ఎంత మారిపోయావే సుధా... ఒక్క విషయం రాయవు కదా – మీ అబ్బాయి పుట్టిన విషయం కానీ. వాడు పెద్ద చదువు చదువుకున్న విషయం కానీ కొడుక్కి పెళ్లి చేసిన విషయం గానీ – ఒక్క విషయం కూడా తెలియజేయవా" అంది గబగబా. 'ఏమున్నాయి విశేషాలు చెప్పు – నువ్వు పెళ్లయి అమెరికా వెళ్లిపోయావు – నేను పెళ్లయి హైదరాబాదు వచ్చేశాను – ఇంక ఏముందీ, ఉద్యోగం, సంసారం – మా చందుకి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో సీటు దొరకదేమోనని కొన్ని రోజులు చింత, అదయ్యాక, ఏ ఉద్యోగం ఎక్కడొస్తుందోనని చింత, సరే, పెళ్లి, మనవడు – ఏముంది చెప్పు – అంది సుధామణి చాలా నిర్లిప్తంగా –

జానకి సుధామణి వంకే చూస్తోంది – సుధామణికి పిల్లలు లేరని చాలా బెంగపడుతోందని నాలుగేళ్లనాడు కూడా ఎవరో చెప్పారు తనకు – మరి!! – ఆఁ, ఏదో పొరపాటు వినింది తను అంతే!!

"సుధా, నీ మనవడు అచ్చం నీలాగే వున్నాడే –" అంది పిల్లాణ్ణి ఎత్తుకుంటూ జానకి.

"మా ఇంటికొచ్చిన వాళ్లంతా ఇదే అంటారు – మా వారికి ఉడుకుమోత్తనం – తనలాగ వున్నాడని ఎవరూ అనరేం అనీ' అంది భర్తకేసి చూసి గలగలా నవ్వి సుధామణి.

స్నేహితురాలు, భర్త వెళ్లిపోయారు.

'ఉత్సాహంగా మాట్లాడవేం వాళ్ల ముందు –' అన్నాడు జయరామ్.

"ఊరుకోండి – మరీ ఉత్సాహంగా మాట్లాడితే, పిల్లాడికి..." సుధామణి గొంతు తగ్గించింది. 'దిష్టి తగులుతుందేమోనని భయం' అంది మనవణ్ణి గుండెలకి హత్తుకుంటూ.

పాతికేళ్ల వయసులో తల్లి అయితే పొందే అనుభూతిలాంటిది అనుభవిస్తూ, మనవణ్ణి క్షణం వదలకుండా వున్న సుధామణిని చూస్తూ, 'కంచి వరద రాజుని ఏమని కోరుకుంటావ్' అన్నాడు జయరామ్.

'వీడికో చెల్లెల్నిమ్మని - అంతే, నాకేం కావాలీ' అంది అప్రయత్నంగా గోడమీద పటానికి దణ్ణం పెట్టి సుధామణి.

'నాకూ అంతే కావాలి' అన్నాడు జయరామ్ మనవణ్ణి ఎత్తుకుంటూ.

కర్టెన్ వెనక వున్న కోడలు బుగ్గలు ఎర్రబడటం ఇద్దరూ గమనించలేదా నిమిషం!!"

'ఎన్ని నాళ్లకీ బతుకు పండెనో...' కూనిరాగం తీస్తూ సుధామణి ఉయ్యాల్లోంచి తీసి తన మంచం మీద పడుకోబెట్టుకుంది మనవణ్ణి.

29, నవ్య వీక్లీ 4 ఆగస్టు 2004